

# ఆకలి

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

భైరవమూర్తి గుడి అరుగు మీద చిరాకుగా కూర్చున్నాడు. అతని కడుపులో ఆకలి అతన్ని నిలవనీయటంలేదు. మూడు రోజుల

క్రితం తిన్న తిండి పేగులకు జ్ఞాపకం లేనట్లుంది. అతన్ని చిత్రవధ చేస్తున్నాయి.

ఆరు అడుగుల పొడవు కాక పీపాలాంటి ఆకారాన్ని తయారు చేసి, తారు పూసి, కళ్ళు ఉండాల్సిన స్థానంలో నిప్పు కణికలు అమరిస్తే భైరవమూర్తి ఆకారం తెలుతుంది. పెద్ద నోరు, దానికి ఆహారం వెతికే ఆ కళ్ళను చూస్తే పసిపిల్లలు భయపడతారు.

'ఇక ఈ పూట తిండి పడక పోతే నిలబడదీ ఘటం' అనుకుంటూ లేచి నిలబడ్డాడు. రోడ్డు అవతలున్న 'టీ' బంకు దగ్గర కెళ్ళేడు. కొట్లో నారాయణన్ 'టీ' కలుపుతున్నాడు. పొగలు కక్కుతోంది 'టీ.' ఆకలితో భైరవమూర్తి పేగులు మూలిగేయి.

"నారాయణా! ఓ 'టీ' చేయవోయ్!" అన్నాడు.

"చాల్లే! ఇవ్వాల్సిన ఆరు రూపాయలు ఇచ్చి, ఆ తర్వాత తాగు. అంతకు మించి అరువు నావల్ల కాదు." తేల్చి చెప్పేడు నారాయణన్.

మరో నిమిషం నిలబడ్డాడు భైరవమూర్తి. నారాయణన్ వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇతనికేసి చూడలేదు.

"సీ డబ్బులుచ్చుకుని ఎక్కడికైనా పారిపోతానా?" అంటూ అక్కడనించి కదిలేడు.

కడుపులో కాక టీ, పెదాల మీదకో బీడి లేక మహా చిరాకుగా వుందతనికి. తిన్నగా గుడి దగ్గరున్న కిళ్ళీ కొట్టు దగ్గర కొచ్చేడు.

"బొండాం! పదిపైసలు బీడిలియ్యి" అన్నాడు.

బొండం బీడిలిస్తూ, "ఇప్పటికే రెండూ ఇరవై అయింది. పద్దు పెంచేయకు" అన్నాడు.

"ఇస్తానోయ్!" విసుక్కుంటూ గుడి అరుగుమీదకొచ్చి కూర్చుని బీడి ముట్టించేడు. పొగ గుండెల నిండా పీల్చేడు. పొగ- ఆకలి కడుపులో దూరి చికాకు పెట్టింది. పెదాలు తడిచేసుకున్నాడు. భుజం మీద తువ్వాలు పక్కన పడేసి యజ్ఞోపవీతంతో నడ్డి గోక్కుంటూ ఆలోచనలో పడ్డాడు.

'పన్నెండు దాటినట్లుంది. రామచంద్రయ్య ఇంటి నించి కబురు రాలేదు. పని పూర్తి అయ్యేసరికి ఏవేళ అవుతుందో? ఇక భోజనం ఎప్పుడో?'

భైరవమూర్తి ఆలోచనల్లో ఉండగానే రామచంద్రయ్య బావమరిది చకచకా నడిచి వస్తున్నాడు.

భైరవమూర్తికి హుషారు కల్గింది. లేచి నిలబడ్డాడు. అతనికేసి చూసాడు. అతగాడు భైరవమూర్తి కేసి చూడకుండానే వెళ్ళిపోయాడు.

'ఇంకా ఆలస్యముంది కాబోలు! ఇంక రాత్రి భోజనమే ప్రాప్తి' అనుకున్నాడు.

సరిగ్గా అప్పుడే వెంకన్న రెండో కొడుకు బస్‌కోసం గుడి దగ్గరకొచ్చేడు.

"నమస్కారం బాబూ! ఆఫీసుకా?" పలకరించేడు. అతను భైరవమూర్తికేసి చూసి ముఖం చిట్లించుకున్నాడు. సమాధానం ఇవ్వలేదు. తల తిప్పుకున్నాడు.

'ఇప్పుడు ముఖం తిప్పుకుంటున్నాడు. వెంకన్న మఘూచిపోపి గుటుక్కుమంటే అయిన వాళ్ళెవరూ మోతకి రాలేదే! తనే వెళ్ళింది. కాళ్ళా వేళ్ళా పడితే వెళ్ళేడు. డబ్బిచ్చేడు. అయితే మాత్రం—మరీ అంత పురుగులా చూడాలా? ఛీ-ఛీ! విశ్వాసం లేని మనుషులు' మనసులోనే తిట్టుకుంటూ మరో బీడి ముట్టించేడు.

ఆకలి, ఎండ- రెండూ భైరవమూర్తిలో భైరవుడ్ని నిద్ర లేపుతున్నాయి.

'పోపీ పరిస్థితి!'ఏంటో అలా రామచంద్రయ్య గుమ్మం ముందు కెళితే? ఇందాకనే ఎగ ఊపిరి వదులుతున్నాడా కుర్రాడు. ఈపాటికి అయిపోయి ఉండచ్చు. వెళ్ళి చూస్తే? ఉహూ- వద్దు. తన్ని చూడగానే అఘాయిత్యం జరిగిపోయినట్లు, కలిపురుషుడే వచ్చినట్లు చూస్తారు. ఛీదరించుకుంటారు. ప్రాణాలు పట్టుకెళ్ళేది యముడు కాని తను కాదు కదా?

రామచంద్రయ్యకి మూడేళ్ళ క్రితం కొడుకు పుట్టడం తనకు తెల్సు. ఆ కుర్రాడి బాలసారెకు తనూ వెళ్ళేడు. తనకు తిలదానం ఇచ్చేరు. ఆ కుర్రాడికేదో అందమైన పేరే పెట్టారు. కుర్రాడు అందంగానే ఉన్నాడు. ఏం జబ్బో! ఏం లోకమో?

ఉదయంవరకు ఆపూట కింకేం పని ఉండదని తనూ అనుకున్నాడు. రేవుకెళ్ళి వస్తుంటే రామచంద్రయ్య ఇంట్లోంచి ఏడుపులు, అలజడి వినిపించాయి. పక్క వాళ్ళెవరో చెప్పారు- 'మెదడువాపు వ్యాధిట. కుర్రాడు బ్రతకడన్నాడుట డాక్టరు.'

తనకి ఓ క్షణం బాధే కల్గింది. కాని ఏం చేస్తాం? ఏ క్షణంలో ఏంటో అనుకుని అరుగుమీదకొచ్చి కూర్చున్నాడు. అయితే ఇంకా పిలుపు రాలేదు.. మెదడువాపు

వ్యాధివస్తే గంటలు...అంతే'... అన్నాడు దీక్షితులు. అతనెక్కడో పేపర్లో చదివేడట మరేంటి ఆలస్యం? పోనీ వెళ్ళి సందు మొదట నిలబడి చూస్తే'

భైరవమూర్తి బీడీ పారేసి లేచి రామచంద్రయ్య సందు చివర కొచ్చాడు.

పెంకుటింటి ముందు గోనెలతో దడి కట్టేరు. దడిలో మూడేళ్ళ బిడ్డన్ని ఒళ్ళో పెట్టుకుని రామ చంద్రయ్య భార్య తలొంచుకుని కూర్చుంది. రామచంద్రయ్య అరుగు మీద తల వాల్చుకుని కూర్చున్నాడు. ఇంటి ఓనరు అతని ప్రక్కన కూర్చుని ఏదో వేదాంతం చెప్తున్నాడు. జనం మూగి ఉన్నారు.

భైరవమూర్తికా వాతావరణం కంగారు కలిగించింది. 'ఏమిటిదీ? అయిపోయిందా? మరి తనకు కబురు రాలేదేం? లేక శరభయ్య గాడికి కబురు పెట్టేరా? ఆ శవాల శరభయ్యగాడి దగ్గరకేనా రామ చంద్రయ్య బావమరది వెళ్ళింది? పోనీ మరో అడుగు ముందుకేసి విషయం తెల్సుకుంటే? వద్దు- చూస్తే విరుచుకు పడతారు'.

భైరవమూర్తి వెనక్కి తిరిగి మళ్ళా గుడి దగ్గరకొచ్చాడు. బీడి ముట్టించి చతికిలపడ్డాడు. ఎత్తుగా ఉన్న గోపురం గోడకి చేర్లబడి పొగ గుండెల నిండా లాగి ఆందో ళనగా వదిలాడు.

ఎదురుగా గోడమీద బల్లి ఎదు రుగా ఉన్న పురుగును అందుకోవ టానికి ప్రయత్నం చేస్తోంది. పురుగు తప్పించుకుంటోంది.

భైరవమూర్తికి అనుమానం తీరలేదు. 'అన్నీ ఐపోతే, తన కెందుకు కబురు రాలేదూ?' ఆకలి ఆరాటాన్ని పెంచుతోంది.

నారాయణన్ 'టీ' బంకులో లేడు. అతని తమ్ముడు టీ చేస్తు న్నాడు. అది చూసిన తర్వాత భైరవమూర్తి అటు నడిచాడు.

"ఓ స్ట్రాంగ్ టీ చేయి" అన్నాడు.

టీ చేతి కొచ్చింది. గభాలున తాగబోతే నాలుక చుర్రుమంది. ఆర్చుకుని, ఆర్చుకుని తాగుతుంటే-

"భైరవా!...." పిలుపు విన్పిం చింది. వెనక్కి తిరిగి చూస్తే శరభయ్య.

"ఏం పనేం లేదేట్రా?" పలక రించాడు శరభయ్య.

భైరవమూర్తికి ముడివిడినట్లని పించింది. 'వీడికి కబురు పెట్టే రన్న మాట! వీడిప్పుడెళ్ళి ఆ కుర్రాడ్ని తీసికెళ్ళి, పదో పరకో లాగించి కడుపునిండా తిండి తింటా

డన్న మాట! రామచంద్రయ్య తల్లి పోయినప్పుడు తనెళ్ళేడు. ఎక్కువేం అడగలేదే? ఇప్పుడు తనకుగాక వీడికెందుకు కబురు పెట్టాలి?'

"ఏరా భైరవా? మాట్లాడవేం! పనుందా- లేదా?" టీ తాగుతూ అడిగాడు శరభయ్య.

"నా గొడవ నీకెందుకూ? నీకు పని తగిలిందిగా- చూసుకో!" చిరాకుగా అన్నాడు భైరవమూర్తి.

"ఏంటిరా గోల! పెద్ద వీధి బామ్మగారు 'హరీ' మంది. ఇద్దర్ని రమ్మన్నారు. నేను వెళుతున్నాను. పొట్టి వంకాయిగాడికోసం వెళ్లాను. వాడు కనబడలేదు. అయినా వెధవ- భూమికి జానెడు లేడు. వాడు మోసే వేపు కొమ్మ వాలిపోయి, మహా ఇబ్బంది. నువ్వు వస్తావా?" అడిగాడు శరభయ్య.

"కర్మ అయిపోయిందా?"

"లేపటమే తరవాయి."

"ఐతే పద!" టీగ్లాసు ఇచ్చేసి పద్దు చెప్పి శరభయ్యని అనుసరించాడు భైరవమూర్తి.

సాయంత్రం తడిగుడ్డలు పిండుకుని, యజ్ఞోపవీతం మార్చుకుని, గుళ్ళో వాహనం వెనుక దాచుకున్న పొడి పంచె కట్టుకున్నాడు భైరవమూర్తి. తడి పంచె ఆరేసుకుని వెళ్ళి నారాయణన్ కొట్లో అప్పు తీర్చేశాడు.

అప్పుడే దింపిన ఉప్మా ఆరు ప్లేట్లు ఆరగించి, స్ట్రాంగ్ టీ పుచ్చుకుని తృప్తిగా త్రేన్చేడు. ఆ తర్వాత బీడి ముట్టించి రెండు దమ్ములు లాగిన తర్వాత భైరవుడు శాంతించాడు.

చీకటిని చీలుస్తు బజార్‌లో లైట్లు వెలుగుతున్నాయి. జనం గబగబా బజారువెంట నడుస్తున్నారు. అంతా హడావిడిగా ఉంది. రామచంద్రయ్య బావమరది రిక్షాలో వెళ్ళుతున్నాడు.

అతన్ని చూసిన తర్వాత భైరవమూర్తికా కుర్రాడు గుర్తొచ్చాడు. తిలదానం పుచ్చుకుని పది రోజుల పసిగుడ్డుని తను ఆశీర్వదించటం గుర్తు వచ్చింది.

ముద్దులు మూట గడుతూ, గుప్పిళ్ళు మూసి తల్లి ఒళ్ళో నిద్రిస్తున్న కుర్రాడు! పచ్చటి పసుపు ఒంటినిండా పూసుకుని పట్టుచీరతో పచ్చి బాలెంతరాలు, సేలం పంచె కట్టుకుని రామచంద్రయ్య- పార్వతీ పరమేశ్వరుల్లా పీటల మీద కూర్చుని తనకు తిలదానం ఇచ్చారు.

తిలదానం పుచ్చుకుని వాళ్ళ శని గ్రహించి 'అపమృత్యు పరిహారం

ద్వారా అయుష్యాభివృద్ధి రస్తు' అని తను వాళ్ళని దీవించాడు. ఆ కుర్రాడ్ని దీవించాడు.

'ఆ పసిపిల్లడికేం కాకూడదు. ఆ కుర్రాడ్ని చూసుకొని మురిసి పోయిన తల్లిదండ్రులు, ఆ కుర్రాడు గొప్పవాడయితే మరీ మురిసిపోవాలి.'

భైరవమూర్తి ఆలోచనలతో పాటు కాళ్ళు కూడా రామ చంద్రయ్య వీధికేసి నడిచాయి.

గోనె గుడ్డలతో కట్టిన దడిలో తల్లి ఒడిలో ఉన్నాడా కుర్రాడు. డాక్టర్ పరీక్ష చేస్తున్నాడు.

'ఏం-ఇంకా సీరియస్‌గా ఉందా? ఏం అవకుండా ఉంటే బాగుండును. వెళ్ళి కనుక్కుంటే?'' వెళ్ళటమా-మానటమా?'- అనే ఆలోచనలో పడ్డాడు భైరవమూర్తి.

మనసు వెళ్ళమని ప్రోత్సహించింది. డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాడు. భైరవమూర్తి ఆ ఇంటి ముందుకెళ్ళి నిలబడ్డాడు. అరుగు మీద కూర్చున్న రామ చంద్రయ్య తలెత్తి చూసాడు.

"ఏం భయపడకండి. తగ్గిపోతుంది. మళ్ళీ మీ ఇంట్లో శుభ కార్యం జరుగుతుంది. ఆనందంగా శుభకార్యం జరుపుకుని మీ శని నాకివ్వండి. నేను గ్రహిస్తాను, అనుభవిస్తాను. మీరు మీ పిల్లాడు ఆనందంగా ఉండాలి, ఉంటారు."

అని భైరవమూర్తి అందామను కున్న మాటలు అనలేకపోయాడు. చుట్టూ అంతా చీదరింపుగా చూస్తున్నారు.

కుర్రాడు చేతులు కదిలిస్తూ తల్లి రొమ్ముకి అతుక్కుంటున్నాడు. తల్లి మాతృ ప్రేమతో అదుము కుంటోంది.

"తగ్గిపోతుంది- తగ్గిపోతుంది" అన్నాడెలాగో గొంతు పెగల్చుకుని.

అక్కడనించి కదిలి గుడి అరుగు మీద కూర్చున్నాడు. ఆ కుర్రాడికేం భయం లేదనిపిస్తోంది మనసుకు. ఆ ఊహ సంతృప్తిని ఇస్తోంది.

గోపురానికి చేర్లబడి బీడి ముట్టించాడు. కడుపు నిండగానే కళ్ళు కూరుకుపోతున్నాయి. 'మరో గంటపోతే గుడి మూసేస్తారు. అప్పుడు పడుకోవచ్చు' అను కుంటూ ఆవలించాడు.

గోపురం గోడ మీద బల్లి కదలటంలేదు. మధ్యాహ్నం నుంచి బల్లి బారినుండి తప్పించుకుంటున్న పురుగు బల్లితోక దగ్గరే వుంది. కాని బల్లి పట్టించుకోవటంలేదు. ∗